

సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 24.591 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 11,977 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా) -	రూ.60,770
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)-	రూ.5,475
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,639
సవర (8 గ్రా) -	రూ.45,112

గరిష్టం/కనిష్టం
36.4 /26.5

వాతావరణం

మంగళవారం గాలిలో తేమ 55 శాతం ఉంది. బుధవారం ఉష్ణోగ్రతలు, ఎండతీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచండి

• డీపీఓ సుస్మితారెడ్డి



మాట్లాడుతున్న డీపీఓ సుస్మితారెడ్డి

నెల్లూరు(పొగతోట): గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని డీపీఓ సుస్మితారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం నెల్లూరులోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులతో నిర్వహించిన సమావేశంలో డీపీఓ మాట్లాడారు. ఇకపై పారిశుద్ధ్యం అధ్వానంగా ఉన్న ప్రాంతాల ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. డిజిటల్ పేమెంట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రంథాలయ పన్ను డిపాజిట్ చేయాలన్నారు. పన్నుల వసూలుపై దృష్టి సారించాలని తెలిపారు. సమావేశంలో ఏఓ మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్కూల్‌గేమ్స్ జట్ల ఎంపికలు



స్కూల్‌గేమ్స్‌కు ఎంపికైన క్రీడాకారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో జిల్లా స్కూల్ గేమ్స్ జట్ల ఎంపికలు మంగళవారం నిర్వహించినట్లు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి ఎస్.విజయ్ తెలిపారు. కబడ్డీ, టెన్నికాయిట్, రగ్బీ, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, త్రోబాల్, టెన్నిస్, తైక్వాండోల్లో ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి దాదాపు 1,500 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్లతోపాటు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ప్రభాకర్‌రెడ్డి, థామస్ పీటర్, ప్రత్యేక ఆహ్వానితులుగా రాపూరు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.లీలాకుమార్, కావలి జవహర్‌భారతి డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

వీఏఏల సర్దుబాటు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని రైతుభరోసా కేంద్రాల్లో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకుల(వీఏఏ)ను ఆయా ప్రాంతాల వారీగా సర్దుబాటు చేస్తూ పూర్తి వివరాలను వ్యవసాయశాఖ కమిషనర్‌కు పంపారు. జిల్లా(ఉమ్మడి నెల్లూరు జిల్లా)లో 666 రైతుభరోసా కేంద్రాలు ఉండగా, వీటిలో 443 మంది వీఏఏలు, 55 మంది గ్రామ హార్టికల్చర్ అసిస్టెంట్లు, మరో ముగ్గురు సెరీకల్చర్ అసిస్టెంట్లు ఉన్నారు. 750 ఎకరాల నుంచి 1,250 ఎకరాల వరకు ఉన్న ప్రాంతంలో ఒక వీఏఏ తప్పకుండా ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వీరిని సర్దుబాటు చేశారు.

ఎల్లో ముఠా కుట్ర

- పేదల సొంతింటి కల భగ్నం
- జగనన్న లేఅవుట్లపై హైకోర్టులో 16 మందితో కేసులు
- 13 పంచాయతీల్లో లేఅవుట్ల పనుల నిలిపివేత
- 1,450 మందికి ఇళ్లు నిర్మించే బృహత్తర ప్రణాళికపై విషం
- పచ్చనేతల కుట్రలతో పేదలకు అందని నివాసాలు





కోర్టు కేసులతో దగదర్తిలో నిలిచిపోయిన జగనన్న కాలనీ లేఅవుట్ పనులు

పేదలకు ఇళ్ల స్థలాలు అందించి, గృహాలు నిర్మించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో లేఅవుట్లను సిద్ధం చేస్తుంటే ఆ లక్ష్యం నెరవేరకుండా ఎల్లో ముఠా కక్ష కట్టింది. జగనన్న లేఅవుట్ల పనులు జరగకుండా కోర్టులో కేసులు వేసింది. దీంతో పనులు ఆగిపోయాయి. ఎల్లో ముఠా కుట్రల కారణంగా తమ సొంతింటి కల నెరవేరకుండా పోవడంతో పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కావలి: దగదర్తి మండలంలో పేదలకు ఇళ్లు దక్కకుండా టీడీపీ నాయకుల ఎల్లో ముఠా నాలుగేళ్లుగా అడ్డుకుంటోంది. నిరుపేద అక్కచెల్లెమ్మల సొంతింటి కల సాకారానికి రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా గూడులేని పేద అక్కచెల్లెమ్మలకు స్థిరనివాసం ఏర్పరచి, వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలనే కృతనిశ్చయంతో ఉంది. ఖరీదైన భూమిని పేదలకు ఉచితంగా పంపిణీ చేయడమే కాక, ఆయా లేఅవుట్లలో మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించనుంది. ఈ నేపథ్యంలో ఇళ్ల స్థలాల పట్టాలన్నీ మహిళల పేరుపై మంజూరు చేయడం ద్వారా వారి సాధికారతకు తోడ్పడుతోందని సామాజిక నిపుణులు ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతున్నారు. పేదలకు పక్కా ఇళ్లు నిర్మించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని సాక్షాత్తూ కేంద్ర ప్రభుత్వం కూడా ప్రశంసించింది.

కొత్తగా జగనన్న కాలనీలు

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలన్న బృహత్తర లక్ష్యసాధన కోసం ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ చేపట్టి విజయవంతంగా పూర్తి చేసింది. అలాగే పెద్ద ఎత్తున పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ ఏర్పాట్లు చేసి వారందరికీ ఇళ్ల నిర్మాణం కోసం కొత్తగా జగనన్న కాలనీలను ఏర్పాటు చేస్తోంది. అయితే, పేదలకు ఇళ్ల పట్టాలివ్వకుండా తెలుగుదేశం పార్టీ నాయకులు అనేక కుట్రలు పన్నారు. జగనన్న లేఅవుట్లలో పనులు జరగకుండా అడ్డుకున్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సిందేనన్న కృతనిశ్చయంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాన్ని భగ్నం చేసేందుకు హైకోర్టులో కేసులు వేశారు. ఎల్లో ముఠా కుట్రపూరితంగా సృష్టించిన అడ్డంకులను అధిగమించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తూనే ఉంది.

13 పంచాయతీల్లో లేఅవుట్లు

దగదర్తి మండలంలోని బోడగుడిపాడు, చెన్నూరు, చౌటపుత్తేడు, దగదర్తి, తడకలూరు, దుండిగం, కాట్రాయపాడు, కె.కె.గుంట, మనుబోలుపాడు, ధర్మవరం, పెదపుత్తేడు, తురిమెర్ల, ఉలవపాళ్ల తదితర గ్రామాల్లోని 1,450 పేద కుటుంబాల కోసం 78 ఎకరాల్లో 16 జగనన్న లేఅవుట్లను సిద్ధం చేశారు. వీటిపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు 16 మందితో ఎల్లో ముఠా హైకోర్టులో కేసులు వేసింది. దీంతో పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయడానికి సాధ్యపడలేదు. జగనన్న లేఅవుట్లు సిద్ధం చేస్తుండగా ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయి. ఇలా ఎల్లో ముఠా ప్రభుత్వ లక్ష్యాన్ని భగ్నం చేసి పేదల సొంతింటి కల నెరవేరకుండా అడ్డుకుంది.

హైకోర్టు ఆదేశాల మేరకు చర్యలు

దగదర్తి మండలంలోని జగనన్న కాలనీల్లో పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేసే కార్యక్రమంపై కొందరు హైకోర్టులో కేసులు వేశారు. హైకోర్టు నుంచి వచ్చే ఆదేశాల మేరకు తదుపరి నిర్ణయం తీసుకుంటాం.

– టీవీఎం కృష్ణప్రసాద్, తహసీల్దార్, దగదర్తి

కోర్టు కేసు వల్లే ఇల్లు రాలేదు



చిన్న గుడిసెలో తలదాచుకుంటున్నాం. కూలీ పనులు చేసుకుంటూ బతికే మాకు పట్టా స్థలం, ఇల్లు ఇస్తామని చెప్పారు. నాలుగేళ్లు అవుతుంది ఆ మాట మాకు చెప్పి. కానీ ఇప్పటి వరకు స్థలం ఇవ్వలేదు. ఇల్లు లేదు. మాకు స్థలాలు ఇవ్వకుండా కోర్టుకు వేయడం వల్ల ఆగిపోయిందని చెప్పారు. అధికారులు, నాయకులు మాకు న్యాయం చేయాలి.

– కలిగిరమ్మ, దగదర్తి

ప్రభుత్వ సాయాన్ని అడ్డుకున్న టీడీపీ



మాకు ఇల్లు లేదు. ఇంటి స్థలం, ఇల్లు మా పేరుపైన ఇస్తామని చెప్పి చాలా కాలం అయింది. కోర్టులో కేసు వేయడం వల్ల మాకు ఇంటి స్థలం ఇవ్వడానికి కుదరలేదంట. మాలాంటి పేదలకు ప్రభుత్వం సాయం చేస్తుంటే టీడీపీకి కష్టంగా ఉంటోంది. అందుకే కదా పేదోళ్లం ఇల్లువాకిలి లేకుండా ఉంటున్నాం.

– అనురాధ, దగదర్తి

టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారు



టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పేదలకు ఇంటి స్థలాలు, ఇళ్లు ఇవ్వలేదు. ప్రస్తుతం కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చొరవ తీసుకొని దగదర్తి మండలంలోని పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తే టీడీపీ నాయకులు అడ్డుకుంటున్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర ఆదేశాల మేరకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలోని ముఠా దగదర్తి మండలంలో పేదలకు పథకాలు దక్కకుండా అడ్డుకుంటున్నారు.

– తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, ఎంపీపీ, దగదర్తి

రూపాయి ఖర్చు లేకుండా వైద్యసేవలు

• కలెక్టర్ ఎం.హరినారాయణన్



స్టాల్స్ పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

కోవూరు: ప్రజలు ఆరోగ్యం పట్ల చైతన్యవంతులు కావాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో రూపాయి ఖర్చులేకుండా నాణ్యమైన వైద్యసేవలు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. మండలంలోని పడుగుపాడు-1 సచివాలయం పరిధిలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను జిల్లా మొత్తం ఏర్పాటు చేస్తామని తెలిపారు. జిల్లాలో ఉన్న 37 మండలాలతోపాటు అర్బన్ ప్రాంతంలో మూడు కలిపి మొత్తం 40 వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఒక్కొక్క వైద్యశిబిరంలో సుమారు 500 మందికి పైగా వైద్య ఆరోగ్య పరీక్షలు చేయాలన్నదే లక్ష్యమన్నారు. ఈ వైద్యశిబిరంలో ఇద్దరు వైద్యులతోపాటు మరో ఇద్దరు వైద్యనిపుణుల ద్వారా వైద్యసేవలు అందించనున్నామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఒక విడతలో వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. రెండో విడతలో మెడికల్ ఆఫీసర్, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్త ఏడు రకాల పరీక్షలు చేసి వారిని జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌కు తీసుకువచ్చి వైద్యుల పర్యవేక్షణలో వైద్యసేవలు, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. మెరుగైన వైద్యసేవలు అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రికి రెఫర్ చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తొలుత హెల్ప్‌డెస్క్‌తోపాటు అక్కడ ఏర్పాటు చేసిన అన్ని స్టాల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, డీఎల్‌డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, డీపీఓ సుస్మిత, డీసీహెచ్‌ఎస్ రమేష్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి బాపిరెడ్డి, ఎంపీడీఓ శ్రీహరి, తహసీల్దార్ పద్మజ, సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ అహమ్మద్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు (దర్గామిట్ట): మాతా శిశు మరణాలు పెరగకుండా, తల్లీబిడ్డ ఆరోగ్యంపై వైద్యులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ వైద్యులకు సూచించారు. మాతా శిశు మరణాలకు సంబంధించి మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, చిన్నపిల్లల ఆరోగ్య భద్రతపై వైద్యులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, రోగి పరిస్థితి విషమంగా ఉన్నప్పుడు ఒకేసారి సరైన ఆస్పత్రికి రెఫర్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. పీహెచ్‌సీ నుంచి సీహెచ్‌సీకి, సీహెచ్‌సీ నుంచి ఏరియా ఆస్పత్రికి, ఏరియా ఆస్పత్రి నుంచి జీజీహెచ్‌కు రెఫర్ చేసే క్రమంలో వైద్యం సకాలంలో అందక ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందని, ఇలాంటి విషాదకర ఘటనలు జరగకుండా వైద్యులు మానవీయ కోణంలో ఆలోచన చేసి ఏ ఆస్పత్రికి రెఫర్ చేస్తే రోగి పరిస్థితి నయమవుతుందో గుర్తించి సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సురక్షితమైన కాన్పులు జరిగేలా అవసరమైన అన్ని వైద్యపరీక్షలు ప్రతి నెలా చేస్తూ, ఏదైనా ఇబ్బంది ఉంటే ముందుగానే గుర్తించి చికిత్స అందించాలని తెలిపారు. అనంతరం మాతా శిశు మరణాలకు సంబంధించి పీహెచ్‌సీల వారీగా సమీక్ష నిర్వహించి కారణాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ సిద్దానాయక్, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, వైద్యులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

• జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): ప్రతి వారం జిల్లా, మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం(స్పందన)తోపాటు క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వపరంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ పేర్కొన్నారు. మర్రిపాడులోని తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రెవెన్యూ రికార్డులు పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు గిట్టుబాటు ధరలు దక్కేలా ప్రత్యేక కార్యాచరణతో ప్రభుత్వ యంత్రాంగం పనిచేస్తుందన్నారు. మర్రిపాడు మండలం డీసీపల్లి, సింగసపల్లి గ్రామాల్లో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకం ద్వారా భూముల రీసర్వే ప్రక్రియ ప్రారంభమైందని, ఈ కార్యక్రమంలో లోపాలు లేకుండా నిర్వహించేందుకు అధికారులకు సూచనలు చేశామని తెలిపారు. మర్రిపాడు మండలంలో అసిస్టెంట్ కలెక్టర్ సంజనా సిన్హా తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారని, సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. సచివాలయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో మండలస్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు నిర్వహించి క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, మర్రిపాడు మండలంలో త్వరలోనే జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీసీ అనిల్‌కుమార్‌యాదవ్, ఆర్‌ఐ సురేంద్ర, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

'విజయ' తీరాలకు చేరుదాం

- జెడ్పీ, మున్సిపల్ పాఠశాలల విద్యార్థులకు 'విజయదీపిక' బుక్స్
- వచ్చే నెలలో పంపిణీకి చర్యలు
- గతేడాది 64.2 శాతం ఉత్తీర్ణత



విజయదీపిక పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ (ఫైల్)

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచి వారిని విజయతీరాలకు చేర్చేలా జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు చర్యలు చేపట్టారు. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో జెడ్పీ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు విజయదీపిక బుక్స్ పంపిణీ చేసి ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషి చేశారు. తద్వారా 64.2 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 10,805 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 6,937 మంది ఉత్తీర్ణులయ్యారు. విజయదీపికతో మంచి ఫలితాలు వచ్చాయి. దీంతో 10వ తరగతి విద్యార్థులకు ముందుగా విజయదీపిక బుక్స్ అందజేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి నిర్ణయించారు. ఈ నిర్ణయం ప్రకారం వచ్చే నెలలో సుమారు 20 వేల మంది విద్యార్థులకు విజయదీపిక బుక్స్ అందించేందుకు జెడ్పీ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

విద్యార్థులకు అందించేలా చర్యలు

గతేడాది జెడ్పీ సర్వసభ్య సమావేశంలో స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అందజేయాలని నిర్ణయం తీసుకున్నారు. జెడ్పీ సర్వసభ్య సమావేశంలో విజయదీపికను ఆవిష్కరించి పాఠశాలలకు సరఫరా చేసి విద్యార్థులకు అందించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ముందుగా స్టడీ మెటీరియల్ తయారు చేయడానికి ఉపాధ్యాయులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను సిద్ధం చేశారు. సిద్ధం చేసిన మెటీరియల్ ప్రింటింగ్‌కు సంబంధించి ప్రస్తుతం టెండర్లు పిలవనున్నారు. టెండర్ ప్రక్రియ పూర్తి చేసి స్టడీ మెటీరియల్ ప్రింటింగ్ చేయించేలా జెడ్పీ చైర్‌పర్సన్, అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ముందుగానే విజయదీపిక బుక్స్

జిల్లాలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 15 వేల మందికిపైగా ఉన్నారు. వారితోపాటు మున్సిపల్ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు విజయదీపిక బుక్స్ అందజేయాలనే ఆలోచనలో అధికారులు ఉన్నారు. దీనికి సంబంధించి కలెక్టర్ అనుమతి తీసుకోవాల్సిఉంది. కలెక్టర్ అనుమతి ఇస్తే మున్సిపల్ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు కూడా విజయదీపిక బుక్స్ అందజేయనున్నారు. తద్వారా జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో సుమారు 20 వేల మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందే అవకాశం ఉంది. గతంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి జెడ్పీ చైర్మన్లుగా ఉన్న కాలంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రతి సంవత్సరం స్టడీ మెటీరియల్ అందించారు. స్టడీ మెటీరియల్ వల్ల జెడ్పీ పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెరిగింది. 2023వ సంవత్సరంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా జెడ్పీ పాలకవర్గం, అధికారులు దృష్టి సారించారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా ముందుగానే అక్టోబర్ నెలలో విద్యార్థులకు విజయదీపిక బుక్స్ అందించేలా జెడ్పీ చైర్‌పర్సన్, అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు



జెడ్పీ పాఠశాలల్లో 10వ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా 10వ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించేలా జెడ్పీ సర్వసభ్య సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం. గతేడాది 10వ తరగతి విద్యార్థులకు విజయదీపిక బుక్స్ అందించడం ద్వారా ఉత్తీర్ణత శాతం పెరిగింది. దీంతో ఈ సంవత్సరం ముందుగా విద్యార్థులకు విజయదీపిక బుక్స్ అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఆనం అరుణమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

పదో తరగతి విద్యార్థులకు విజయదీపిక



గతేడాది పదో తరగతి విద్యార్థులకు విజయదీపిక బుక్స్ అందించి మంచి ఫలితాలు సాధించాం. ఈ ఏడాది కూడా పదో తరగతి విద్యార్థులందరికీ విజయదీపిక అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. వచ్చే నెలలో పాఠశాలలకు స్టడీ మెటీరియల్ సరఫరా చేసేలా చర్యలు చేపడుతున్నాం.

– బి.చిరంజీవి, జెడ్పీ సీఈఓ

నేడు పొదలకూరులో 'జగనన్నకు చెబుదాం'



నెల్లూరు(దర్గామిట్ట): పొదలకూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా, మండలస్థాయి అధికారులు హాజరవుతారని మండలంలోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేయాలని కోరారు.



క్లుప్తంగా

మిద్దెపై నుంచి పడి వివాహిత మృతి

నెల్లూరు(క్రైమ్): మిద్దెపైన దుస్తులు ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి వివాహిత మృతిచెందిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఎం.మంజు (23)కు నెల్లూరు మన్సూర్‌నగర్‌కు చెందిన విజయ్‌తో మూడు సంవత్సరాల క్రితం వివాహమైంది. వారికి ఒక బాబు ఉన్నాడు. విజయ్ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం మంజు మిద్దెపైన దుస్తులు ఆరబెడుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి తీవ్రగాయాలపాలైంది. ఆమెను కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం రామచంద్రారెడ్డి ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో విజయ్ జరిగిన విషయాన్ని మృతురాలి కుటుంబసభ్యులకు తెలియజేశాడు. వారు నెల్లూరుకు చేరుకుని మంజు మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ఈ మేరకు మృతురాలి తల్లి అలివేలు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సైదులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి మంగళవారం ప్రభుత్వ వైద్యులు పోస్టుమార్టం చేసి బాధిత కుటుంబసభ్యులకు అప్పగించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు


శ్రీనివాసులు (ఫైల్)

వెంకటాచలం: దైవ దర్శనం కోసం మండలంలోని గొలగమూడికి వచ్చిన తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం కొత్త వీరాపురం గ్రామానికి చెందిన మొద్దూరు శ్రీనివాసులు (50) అనే వ్యక్తి కనిపించడంలేదని అతని కుమారుడు లోకేశ్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. వారి కథనం మేరకు.. ఈనెల 23వ తేదీన శ్రీనివాసులు, అతని కుమారుడు మోటార్‌బైక్‌పై కొత్త వీరాపురం గ్రామం నుంచి గొలగమూడికి వచ్చారు. ఆరోజు రాత్రి 9.40 గంటల నుంచి శ్రీనివాసులు కనిపించలేదు. దీంతో లోకేశ్ గొలగమూడి గ్రామం చుట్టూ ఆదివారం ఉదయం వరకు వెతికాడు. అయితే తండ్రి కనిపించలేదు. దీంతో స్వగ్రామానికి వెళ్లి ఉంటాడేమోనని భావించాడు. గ్రామానికి వెళ్లగా ఇంటికి రాలేదని కుటుంబసభ్యులు చెప్పారు. బంధువుల గ్రామాల్లో వెతికినా జాడ తెలియకపోవడంతో మంగళవారం వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిపై దాడి కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై కత్తితో దాడి చేసి బంగారు ఆభరణాలు దోచుకెళ్లేందుకు యత్నించిన ఘటనలో నిందితుడిని నెల్లూరు నవాబుపేట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. నవాబుపేటలోని ఓ అపార్ట్‌మెంట్‌కు చెందిన బాబు రాధాకృష్ణారెడ్డి ఆన్‌లైన్ మార్కెటింగ్ ట్రేడింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే ఆయన జల్సాలకు అలవాటుపడి అప్పులపాలయ్యాడు. దీంతో అనాథాశ్రమాలు నిర్వహిస్తున్నామని ప్రతి ఇంటికీ వెళ్లి డబ్బులు దండుకోసాగాడు. ఈ నేపథ్యంలో జీనిగలవీధికి చెందిన వీరమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా నివాసం ఉండడం, ఆమె చేతిలో బంగారు గాజులుండడాన్ని గమనించాడు. ఎలాగైనా వాటిని దోచుకోవాలని నిర్ణయించుకుని రెక్కీ వేశాడు. సోమవారం వృద్ధురాలి ఇంట్లోకి ప్రవేశించి ఆమెపై కత్తితో దాడి చేసి చేతికున్న రూ.1.92 లక్షల విలువ చేసే 48 గ్రాములున్న నాలుగు బంగారు గాజులను దోచుకుని పరారయ్యేందుకు యత్నించాడు. బాధితురాలు పెద్దగా కేకలు వేసింది. దీంతో స్థానికులు రాధాకృష్ణారెడ్డిని పట్టుకుని దేహశుద్ధి చేసి నవాబుపేట పోలీసులకు అప్పగించారు. ఘటనా స్థలాన్ని ఇన్‌స్పెక్టర్ ఎం.బాబీ పరిశీలించారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. అతడి నుంచి బంగారు గాజులు, కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలు, జరిమానా

అనుమసముద్రంపేట: హత్యాయత్నం కేసులో ఇద్దరికి జైలుశిక్షతోపాటు జరిమానా విధించారు. ఏఎస్‌పేట ఎస్సై నరేష్ మంగళవారం వివరాలు వెల్లడించారు. 2018 సంవత్సరంలో మండలంలోని గుడిపాడు గ్రామంలో ఆవుల మంద కొండయ్య అనే రైతు తన పొలాన్ని దున్నేందుకు ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. డ్రైవర్ కుండా జంగమరెడ్డి మద్యం మత్తులో అతివేగంగా నడుపుతూ పొలాన్ని సరిగా దున్నడం లేదని రైతు కొండయ్య గుర్తించాడు. ఈ విషయంపై డ్రైవర్‌కు చెప్పాడు. ఈ క్రమంలో వారి మధ్య గొడవ చోటుచేసుకుంది. జంగమరెడ్డి ట్రాక్టర్‌ను కొండయ్య మీదకు నడపడంతో అతని రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. డ్రైవర్‌కు మద్దతుగా దేవరాల పెంచలయ్య గొడవకు దిగాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నెల్లూరు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో డ్రైవర్ కొండా జంగమరెడ్డికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా, రెండో నిందితుడు దేవరాల పెంచలయ్యకు రెండు నెలల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వచ్చింది.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	:115
లేయర్ (లైవ్)	:115
బ్రాయిలర్ చికెన్	:204
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:226
లేయర్ చికెన్	:195

వీఎస్‌యూ ఘన కీర్తి

విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ).. ఉన్నత విద్య అభ్యసించాలనుకునే జిల్లా విద్యార్థులకు వరం ఇది. నాలుగేళ్లుగా వర్సిటీ ప్రగతి మార్గంలో పయనిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక శ్రద్ధ, విద్యాలయ అధికారుల సమష్టి కృషి కారణంగా ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు జరిగాయి. అత్యంత కీలకమైన న్యాక్ ఏ గ్రేడ్‌ను ఇటీవల సాధించడంతో వర్సిటీ రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి.

- ప్రగతి మార్గంలో యూనివర్సిటీ
- నాలుగేళ్లలో మారిన రూపురేఖలు
- న్యాక్ ఏ గ్రేడ్ సాధించడంతో గుర్తింపు
- అభివృద్ధికి భారీగా సమకూరనున్న రూసా నిధులు
- విద్యార్థులకు ఎంతో ఉపయోగం



డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పరిపాలన భవనం

వెంకటాచలం: పేద విద్యార్థుల కోసం దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జిల్లాలో 2008 సంవత్సరంలో వీఎస్‌యూను ఏర్పాటు చేశారు. తొలుత నెల్లూరు నగరంలో వర్సిటీని ప్రారంభించారు. వెంకటాచలం మండలం కాకుటూరులో సొంత భవనాల నిర్మాణానికి 83 ఎకరాల స్థలం కేటాయించారు. అయితే వైఎస్సార్ మరణానంతరం వచ్చిన ప్రభుత్వాలు భవన నిర్మాణ పనుల్లో జాప్యం చేశాయి. కొన్ని సంవత్సరాలకు సొంత భవనంలోకి మారింది. అయితే కొన్ని నిర్మాణాలు మాత్రం అసంపూర్తిగానే ఉండిపోయాయి.

తొలి ప్రయత్నంలోనే..

వీఎస్‌యూ తొలి ప్రయత్నంలోనే ప్రతిష్టాత్మకమైన నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (న్యాక్) నుంచి ఏ గ్రేడ్ సాధించింది. గతంలో వర్సిటీ 2ఎఫ్, 12బీ గుర్తింపు పొందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మౌలిక వసతులు, కోర్సులు, బోధనా విధానం, పరిశోధనలు, ఎన్ఎస్ఎస్ సేవలు, వృత్తి నైపుణ్య శిక్షణ, క్రీడా వసతులు తదితర అంశాలపై రెండేళ్లకుపైగా కసరత్తు చేశారు. యూజీసీ మార్గదర్శకాలకు అనుగుణంగా న్యాక్ సూచించిన వివరాలను నమోదు చేసి ఈ ఏడాది మార్చిలో సంబంధిత అధికారులకు సమర్పించారు. గత నెలలో మూడురోజులపాటు న్యాక్ బృందం వర్సిటీని పరిశీలించింది. బృంద సభ్యులు అన్ని అంశాలను క్షుణ్ణంగా చూశారు. వారు సంతృప్తి చెంది ఈనెల 14వ తేదీన వీఎస్‌యూకు 3.23 సీజీపీఏతో ఏ గ్రేడ్ కేటాయించారు. అసెస్‌మెంట్‌కు వెళ్లిన తొలి సైకిల్‌లోనే అత్యంత కీలకమైన ఏ గ్రేడ్ సాధించడంతో వీసీ, రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. అందరి సమష్టి కృషి కారణంగానే వర్సిటీకి ప్రతిష్టాత్మకమైన న్యాక్ ఏ గ్రేడ్ సమకూరింది.

సమష్టి కృషితోనే సాధించాం



విక్రమ సింహపురి యూనివర్సిటీ తొలి ప్రయత్నంలోనే న్యాక్ ఏ గ్రేడ్ సాధించడం జిల్లాకు గర్వకారణం. సమష్టి కృషితో ఈ ఘనతను సాధించగలిగాం. వర్సిటీ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎం.గురుమూర్తి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఎంతో సహకరించారు. తదుపరి సైకిల్‌లో మరింత ఉన్నత గ్రేడ్ సాధించేందుకు కృషి చేస్తాం.

– జీఎం సుందరవల్లి, వీసీ, వీఎస్‌యూ

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక..

గత ప్రభుత్వాలు వీఎస్‌యూ అభివృద్ధిని పూర్తిగా విస్మరించడంతో అధికారులు, విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక పరిస్థితి పూర్తిగా మారింది. వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వీసీ జీఎం సుందరవల్లి వర్సిటీ అభివృద్ధి గురించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అసంపూర్తిగా ఉన్న భవనాలతోపాటు, అధునాతన డిజిటల్ లైబ్రరీ, పరిపాలన భవనం నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అలాగే వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎం.గురుమూర్తి, ఆదాల ప్రభాకర్‌రెడ్డిలు తమ ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులు మంజూరు చేసి వీఎస్‌యూలో సెంట్రల్ లైటింగ్, స్కిల్ డెవలప్‌మెంట్ భవనం, ప్రహరీ నిర్మాణ పనులు చేయించారు. కొందరు దాతలు, సీఎస్ఆర్ నిధులతో తరగతి గదుల్లో స్మార్ట్ బోర్డులు, సోలార్ పవర్, ఆర్వో ప్లాంట్లు తదితర సౌకర్యాలు సమకూరాయి.

ప్రయోజనాలివీ..

న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపుతో వీఎస్‌యూ అభివృద్ధికి ఏటా కేంద్ర ప్రభుత్వం నుంచి రూసా పథకం ద్వారా రూ.20 కోట్లు మంజూరు కానున్నాయి. ఈ నిధుల ద్వారా వర్సిటీ మరింత అభివృద్ధి చెందుతుంది. ఏ గ్రేడ్‌తో వీఎస్‌యూకి జాతీయస్థాయిలో గుర్తింపు లభిస్తుంది. తద్వారా వర్సిటీలో చదివే విద్యార్థులు ఉద్యోగావకాశాలు, ఉన్నత చదువుల్లో ప్రత్యేకావకాశాలు లభిస్తాయి. విదేశీ విశ్వవిద్యాలయాలతో ఒప్పందాలు, స్వయం ప్రాతిపదిక కోర్సుల నిర్మాణానికి న్యాక్ గుర్తింపు ఉపయోగకరంగా మారుతుంది. ఐదేళ్లపాటు ఏ గ్రేడ్ అమల్లో ఉండనుండడంతో తదుపరి సైకిల్‌లో మరింత ఉన్నత గ్రేడ్ సాధించేందుకు అవకాశాలు మెరుగుపడుతాయి.


వర్సిటీలో రూ.1.91 కోట్లతో నిర్మించిన మహిళా వసతి గృహాన్ని ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి (ఫైల్)


న్యాక్ ఏ గ్రేడ్ సాధించడంతో వీసీ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆనందోత్సవాలు (ఫైల్)



తిరుపతి ఎంపీ నిధులు రూ.23 లక్షలతో నిర్మించి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నైపుణ్యాభివృద్ధి కేంద్రం

భూముల రీసర్వేపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): భూముల రీసర్వేపై ప్రత్యేక దృష్టి సారించి మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్ నుంచి కలెక్టర్, జేసీ ఆర్.కూర్మనాథ్ కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లు, రీసర్వే డీటీలు, సర్వేయర్లు, వీఆర్వోలు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరినారాయణన్ మాట్లాడుతూ నవంబర్ 20వ తేదీ నాటికి ఫైనల్ ఆర్ఓఆర్ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రణాళికాబద్ధంగా పనిచేసి ఈ లక్ష్యాన్ని సాధించాలన్నారు. రోజు ఆయా మండల స్థాయి సర్వే టీమ్ ఫీల్డ్‌లో ఉందా? లేదా? అని తెలుసుకోవాలన్నారు. విలేజ్ బౌండరీ, ప్రభుత్వ అటవీ భూముల బౌండరీ, గ్రౌండ్ ట్రూతింగ్‌కి సంబంధించి రోజు వారీ లక్ష్యాలను సాధించకపోతే చర్యలు తప్పవన్నారు. కలెక్టర్ రెవెన్యూ అంశాలపై సమీక్షిస్తూ వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు బాధ్యతతో పనిచేసి ప్రజలకు సంబంధించిన భూ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 18 మండలాల నుంచి మాత్రమే కొత్త అసైన్‌మెంట్ చేయాలని వచ్చిన దరఖాస్తుల వివరాలను గ్రామాల వారీగా, మండలాల వారీగా జాబితా రూపొందించాలని తహసీల్దార్లను ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలో పురోగతి సాధించాలన్నారు. సమావేశంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ హనుమాన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్, పక్కన జేసీ కూర్మనాథ్

పోర్టు నిర్మాణంతో ఉపాధి అవకాశాలు

- ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరావు

గుడ్లూరు: రామాయపట్నం పోర్టు నిర్మాణంతో ఈ ప్రాంతంలో ఓడరేవుల ఆధారిత పరిశ్రమలు ఏర్పాటై ప్రజలకు ఉపాధి అవకాశాలు వస్తాయని ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని మొండివారిపాళెం వద్ద పోర్టు నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పోర్టు అధికారులు, అరబిందో ఇన్‌ఫ్రా ప్రతినిధులు శ్రీనివాసరావుకు పనుల వివరాలను వెల్లడించారు. 850 ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోర్టు నిర్మాణ పనులను చేపట్టినట్లు పోర్టు జనరల్ మేనేజర్లు శేషుకుమార్, కంద పెరుమాళ్, సుధాకర్‌రావు చైర్మన్‌కు వివరించారు. దక్షిణ, ఉత్తర బ్రేక్ వాటర్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు రాష్ట్రానికే మణిహారం అన్నారు. గత ప్రభుత్వం శంకుస్థాపన చేసి వదిలేసిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి రామాయపట్నం పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. రికార్డు స్థాయిలో సంవత్సరంలోనే బ్రేక్ వాటర్ పనులు పూర్తి చేయించారన్నారు. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల ప్రజల ఆకాంక్షలను నేరవేర్చుతున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. పోర్టులు, షిప్పింగ్ హార్బర్ల నిర్మాణాలు పూర్తయితే రాష్ట్రం సుసంపన్నం అవుతుందని తెలిపారు. డిసెంబర్ నాటికి మొదటి బెర్త్ నిర్మాణం పూర్తి చేసి ముఖ్యమంత్రితో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నందుకు అరబిందో కంపెనీ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సూర్యనారాయణసింగ్, సేఫ్టీ మేనేజర్ పోలారావు పాల్గొన్నారు.


వివరాలు తెలుసుకుంటున్న చైర్మన్ శ్రీనివాసరావు

జగనన్న ఆరోగ్య సురక్షకు అధిక ప్రాధాన్యం

- కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వైద్య సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన సర్వేకు అధిక ప్రాధాన్యమివ్వాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని 8/2 విజయగోపాలపురం, 9/4 పుట్టా స్ట్రీట్ వార్డు సచివాలయాలను కమిషనర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, స్పందన రిజిస్టర్లతోపాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అన్ని సచివాలయాల పరిధిలో పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. వైద్య సదుపాయాలు పేదలందరికీ చేరువయ్యేలా హెల్త్ సెక్రటరీలు కృషి చేయాలన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

ఐషర్ వాహన క్యాబిన్ దగ్ధం

నెల్లూరు(క్రైమ్): షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఐషర్ వాహనం క్యాబిన్ దగ్ధమైన ఘటన మంగళవారం బుజబుజనెల్లూరు వద్ద జరిగింది. అగ్నిమాపక శాఖ అధికారుల కథనం మేరకు.. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన శ్రీహరిబాబుకు ఐషర్ వాహనం ఉంది. మంగళవారం డ్రైవర్ ఐచర్ వాహనంతో నెల్లూరుకు వచ్చి తిరిగి సూళ్లూరుపేటకు బయలుదేరారు. బుజబుజనెల్లూరు జాతీయ రహదారిపైకి వచ్చేసరికి షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తమై వాహనాన్ని నిలిపి క్యాబిన్‌లో నుంచి బయటకు పరుగులు తీసి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో క్యాబిన్ పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లి ఉంటుందని అధికారులు తెలిపారు.


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జాతర రెండో చాటింపు నేడు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ తల్లి జాతరకు సంబంధించి బుధవారం రాత్రి రెండో చాటింపు వేయనున్నారు. తొలుత కాంపాళెంలోని గాలిగంగుల అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం కామాక్షమ్మ ఆలయం వద్ద చాటింపు వేస్తారు. పట్టణంలోని ప్రధాన మార్గం పాతకోట, పోలేరమ్మతల్లి, రాజా ప్యాలెస్ మీదుగా పాతశివాలయం వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అక్టోబర్ 1న ఆదివారం ఘటోత్సవం, 4, 5 తేదీల్లో అమ్మవారి నిలుపు, నగరోత్సవం, నిమ్మజన జరుగుతాయి.

పటిష్ట బందోబస్తు

పోలేరమ్మ జాతరకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ తెలిపారు. వెంకటగిరిలో అమ్మవారి జాతర జరిగే ప్రధాన ప్రదేశాలైన కుమ్మరింట, జీనుగులవారి వీధి, అమ్మవారి ఆలయం తదితర ప్రదేశాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జాతరకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భక్తులు అమ్మవారి దర్శనం చేసుకునేందుకు ప్రత్యేక క్యూలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై నరసింహారావు, ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మేమొచ్చేశాం..

- ఒకటి నుంచి పక్షుల కేంద్రం ప్రారంభం

దొరవారిసత్రం: మండలంలోని నేలపట్టు పక్షుల కేంద్రాన్ని అక్టోబర్ 1వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు స్థానిక ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విదేశీ వలస పక్షుల సీజన్ అక్టోబర్‌లో మొదలై వచ్చే ఏప్రిల్‌కు ముగుస్తుందన్నారు. ఇప్పటికే నత్తగుల్లకొంగలు, నీటికాకులు, విజిలింగ్ డక్స్, స్వాతికొంగలు తదితరాలు విచ్చేసి కడప చెట్లపై విడిది చేస్తున్నాయని తెలిపారు. గూడబాతులు, తెల్లకంకణాయిలు, తెడ్డుముక్కు కొంగలు విచ్చేయాల్సి ఉందని రేంజర్ వెల్లడించారు.



వీఎస్‌యూ వార్షికోత్సవం నేడు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వీసీ జీఎం సుందరవల్లి, ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు.

ఒకటిన అండర్-14 క్రికెట్ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అండర్-14 క్రికెట్ జిల్లా జట్ల ఎంపికలు అక్టోబర్ ఒకటో తేదీన నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో జరుగుతాయని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి నిఖిలేశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ధ్రువీకరణ పత్రాలు, క్రికెట్ కిట్, వైట్ అండ్ వైట్ డ్రెస్ కోడ్‌తో ఆరోజు ఉదయం 8 గంటలకు రావాలని పేర్కొన్నారు.

రైలు పట్టాలపై మృతదేహం

బిట్రగుంట: కావలి – శ్రీవెంకటేశ్వరపాళెం రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు మంగళవారం గుర్తించారు. మృతుడి వయసు 35 నుంచి 40 సంవత్సరాల్లోపు ఉండొచ్చని భావిస్తున్నారు. నలుపు, తెలుపు రంగులు కలిగిన హాఫ్ హ్యాండ్ టీ షర్ట్, ఆకుపచ్చ రంగు నైట్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మూడో లైన్‌లో వెళ్తున్న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.70
సన్నవి : రూ.30
పండ్లు : రూ.8

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry 9381287629 [T-4614]

DIRECT FINAL YEAR

■డైరెక్ట్ ఫైనల్ ఇయర్: BA, B.Com, B.Sc, BBA, BCA, MBA, MCA, Diploma, B.Tech, 10th, Inter, APOSS ద్వారా పాసయ్యే అవకాశం. Maruthi Academy, Nellore. Cont: 90320 30145, 147 [NA-10941]

REAL ESTATE

■బాలాజీ రియల్ ఎస్టేట్స్ : ఇల్లు, పొలాలు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్స్ కొనదలచిన, అమ్మదలచిన వారు సంప్రదించండి: 94410 37366. [NA-11537]

PLOT FOR SALE

■ప్లాట్లుఅమ్మబడును.అం॥40వేలు-1లక్ష,ధనలక్ష్మీపురం, గొలగమూడి, కసుమూరు, NH5 చెముడుగుంట, ఆమంచర్ల, పొట్టేపాలెం, పొదలకూరు. క్లియర్ టైటిల్స్& స్పాట్‌రిజిస్ట్రేషన్. సంప్ర:8885683888. [NA-22748]

■నెల్లూరు, రామలింగాపురం, సాయివిద్యానికేతన్ స్కూల్ ప్రక్కన 45అం॥ స్థలం అమ్మకమునకు కలదు. మినిబైపాస్‌రోడ్ నుంచి 3వ బిట్. వివరములకు సంప్రదించండి: 9951917171. [NA-288]

SERVICES

GOLD FINANCE

■ బ్యాంకులలో వివిధ తాకట్టు సంస్థలలో ఉన్నది బంగారు వేలం సమయానికి విడిపించి మార్కెట్ ధర ప్రకారం స్పాట్ క్యాష్ ఇవ్వబడును. 62813 46878, 98851 82772. [N-1231813]

TOURS & TRAVELS

■ కొడైకెనాల్, మూనార్, అలెప్పి, త్రివేండ్రమ్, బహుబలి, వాటర్ పాల్స్, పొల్లాచి. తేది:13.10.2023, 7రోజులు. టికెట్ : 11,500 (AC Bus) K.వాసు, నెల్లూరు. సెల్ : 94913 40504. [NA-22746]

■కార్తీకపౌర్ణమి సందర్భంగా కాశీయాత్ర 22-11-2023, ద॥పూరి, కోణార్క్, భువనేశ్వర్, సాక్షి గోపాల్, అలహాబాద్, సీతామఢి, 9రోజులు టి॥ ఒక్కింటికి 10500. STట్రావెల్స్. 9885853240 [G-7699]

WANTED

■Wanted Marketing Staff and Govt Retired Persons for Our Real-Estate Company. Salary : 25K and Commissions. Contact: 9000731560. [NA-5910]

■Electric Vehicle Service Engineer. Salary : 12000-15000 / Month. Qualification : ITI / B.Tech Electrical. Job Loaction: Nellore. Contact: 9959675360. [NA-5239]

■ Urgent Requirement Team Leader and Field Executives in HDFC Bank Collections Department. Nellore and Kavali Locations Contact: 9885520220, 9966778879 [T-764076]

■Wanted Teachers to Teach 1st & 2nd Mother Teachers, 3rd to 5th English & Science, 6th to 10th Biology & Study Hour Teachers & Also P.E.T. Salary Negotiable. Contact Immediately. Cell: 9440266743. [NA-2551]

■నెల్లూరు, పొదలకూరులోని కిసాన్‌క్రాఫ్ట్ లిమిటెడ్ కంపెనీలో పని చేయుటకు కుక్ (వంట) మాస్టర్ కావలెను. అనుభవం కనీసం 5సం॥లు. జీతం +ESI+PF సంప్రదించండి : 9494291336. [N-1231958]

■KTM బైక్ షోరూం నందు పని చేయుటకు సర్వీస్ అడ్వైజర్స్ కం కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. బయోడేటాతో సంప్ర: HDFC బ్యాంక్ ఎదురుగా వేదాయపాళెం, నెల్లూరు. [NA-1679]

■నెల్లూరు సిటీ అమెజాన్ నందు వర్క్ చేయుటకు నైట్ డ్యూటీ బాయ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్రదించండి: 93912 40756, 79936 91149. [NA-22745]

■మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221646]

■నెల్లూరు మినిబైపాస్‌రోడ్డు TDP ఆఫీసు ఎదురుగా HPCL పెట్రోల్ బంకులో పని చేయుటకు పంపు బాయ్స్ కావలెను. జీతం: 12,000/-. సంప్రదించండి: 8919923469, 8341828889. [NA-22747]

■ప్రభవ పబ్లికేషన్స్ నందు పని చేయుటకు డ్రైవర్ కావలెను. డ్రైవింగ్ లైసెన్స్, బయోడేటాతో సంప్ర .0861-2337573(10AM-5PM).9959258261, 8341144605 (వాట్సాప్ మాత్రమే). [NA-5908]

■నెల్లూరు ప్రముఖ షాపింగ్‌మాల్స్‌లో పని చేయుటకు సెక్యూరిటిగార్డులు-12గం॥లు-జీ:15,000. సూపర్‌వైజర్స్-12గం॥-జీ:18,000. సంప్ర: Max SecurityAgency.7730944033, 9951074148. [NA-5906]

■మా డాక్యుమెంట్ రైటర్ ఆఫీసు నందు దస్తావేజులు తయారు చేయుటకు తెలుగు, ఇంగ్లీషు టైపింగ్ చేయగల డి.టి.పి కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. సంప్ర: 9948262787. [NA-11536]

■వాటర్ ప్లాంట్ నందు పర్మినెంటుగా పని చేయుటకుడ్రైవింగ్‌వచ్చినసేల్స్‌మెన్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. ఉచిత వసతి. ఉత్సాహవంతులైన యువకులు సంప్ర: 91820 09306. [NA-22724]

■యూనివర్సిటీజిరాక్స్,గాంధీబొమ్మ వద్ద ట్రంకు రోడ్డు నందు పని చేయుటకు కంప్యూటర్, జిరాక్స్ ఆపరేటర్ కావలెను. అనుభవం అవసరం లేదు. యువతి, యువకులు. సంప్ర: 98481 54861. [NA-287]

■రేమండ్ షాప్, సర్జికి సెంటర్, నెల్లూరు నందు పని చేయుటకు సేల్స్‌మెన్,హెల్పర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతము ఇవ్వబడును. 30సం॥ లోపు వారు సంప్ర. సెల్: 93901 62762. [NA-278]

■బ్యాంక్‌లోన్స్ ప్రాసెస్ నందు TeleCaller కావలెను. Married Female టార్గెట్స్ లేవు. జీతం: 12,000/-.ట్రంక్‌రోడ్, నెల్లూరు. వివరములకు సంప్రదించండి: 88858 02000. [NA-22719]

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా,నర్సులు, వంట చేయువారు,RMP & డాక్టర్స్ కావలెను. జీ: 12000–35000 ఫ్రీ రూమ్+ భోజనం. Hyd. ఫోన్: 9391753308. [HA-654]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. Ph: 9848571888/ 9160900024 [HA-657]

■ప్రభవ పబ్లికేషన్స్ నందు ఆఫీస్ అసిస్టెంట్‌గా పని చేయుటకు ఏదైనా డిగ్రీ చదివిన యువతులు కావలెను. బయోడేటాతో సంప్రదించండి: 0861-2337573(10AM-5PM Only). 9959258261, 8341144605 (వాట్సాప్ మాత్రమే). [NA-5907]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.